రామస్మరణం మర్చిపోతే స్మరణంలోని 'స' పోయినట్లే అనే అదర్శంతో జీవించాడు. ఓ రోజు ఆయన కోసం పై లోకాల్లోంచి వచ్చిన ఒకతను చెప్పాడు.

"పద. వెళదాం."

"మీరు రాముడా?" ఉత్సాహంగా ప్రశ్నించాడు భక్తుడు.

"కాదు. యముడ్ని."

"ఓ! ఈ రూపంలో వచ్చావా నా తండ్రి. పద."

యముడి వెంట ఆ రామ భక్తుడు ఆనందంగా వెళ్ళాడు.

## 177. కర్మ ఫలం

ఓ పాల వ్యాపారి ఓసారి పొరుగూరికి బయలుదేరాడు. అడవి దారిలో మధ్యాహ్నం భోజనం చేయడానికి ఓ చెరువు పక్కన ఆగాడు. అన్నం మూటని గట్టున పెట్టి కాళ్ళు, చేతులు కడుక్కోడానికి చెరువులోకి దిగాడు. పైకి వచ్చి చూస్తే ఓ చెట్టు మీది కోతి దగ్గర తన మూట కనిపించింది. అప్పటికే అది దాంట్లోని పెరుగన్నం తింటోంది.

తర్వాత అది ఆ మూటలోంచి రూపాయి నాణాలని తీసి ఒక్కోదాన్ని అటు, ఇటు తిప్పి చూసి ఒకటి చెరువులోకి విసిరేసి, ఇంకొకటి గట్టున పడేయసాగింది. అందులోని నాణాలన్నీ అయిపోయాక అది వెళ్ళిపోయింది.

ఆ పాల వ్యాపారి పాలల్లో నీళ్ళు కలిపి సంపాదించిన సగం డబ్బు నీళ్ళ పాలైంది. పాలతో సంపాదించిన సొమ్ము మాత్రం అతనికి దక్కింది.

ఎవరు చేసిందానికి వారికి తగిన, సరైన ఫలాన్ని కర్మ ఇస్తుంది.

## 178. బహుమతి

ఓ ఎడారి ప్రాంతంలో నివశించే ఓ వ్యక్తి తన గురువు దగ్గరకి వెళ్తూ, ఓ ఒయాసిస్‌లోని రుచి గల నీటిని ఓ తోలు సంచీలో నింపుకుని, దాని

మూతిని బిగించి తీసుకెళ్ళాడు. కాలి నడకన నాలుగు రోజులు ప్రయాణించి అతను తన గురువుని కలుసుకున్నాడు. ఆయనకి వినయంగా నమస్కరించి, తను తెచ్చిన మంచి నీటిని ఓ గ్లాసులో పోసి ఇచ్చాడు. దాన్ని గురువు తాగి, అంతటి రుచికరమైన మంచి నీటిని తెచ్చినందుకు సంతృప్తిని వ్యక్తం చేసాడు.

ఆ శిష్యుడు ఆనందంగా వెళ్ళిపోయాక, గురువు ప్రధాన శిష్యుడు ఆ తోలు సంచీలోని నీటిని రుచి చూద్దామని కొద్దిగా తాగి వెంటనే ఉమ్మేసి గురువుని అడిగాడు.

"ఈ నీరు చెడిపోయి వాసన వేస్తోంది. మరి మంచి నీటిని తాగినట్లుగా అతనితో ఎందుకు మాట్లాడారు?"

"నువ్వు రుచి చూసింది కేవలం నీటినే. నేను అతను తెచ్చిన బహుమతి వెనక వున్న ఇవ్వాలన్న తపనని రుచి చూసాను." చెప్పాడు గురువు.

ఏదైనా ఇవ్వడానికి వెనక వుండే ప్రేమ వెల లేనిది.

## 179. దేవుడి కంఠం

"నాతో దేవుడు మాట్లాడితే ఆయన కంఠం వినాలని వుంది." హిమాలయాల్లోని ఓ యోగితో చెప్పాడు ఓ యాత్రికుడు.

ఆ యోగి మౌనంగా తల వూపి తన వెంట రమ్మన్నట్లుగా సౌంజ్ఞ చేసాడు. ఆ యాత్రికుడు యోగిని అనుసరించాడు. రెండు రోజులు నడిచి అత్యంత ఎత్తయిన ఓ పర్వత శిఖరం మీదకి అతను యోగితో పాటు చేరుకున్నాడు.

"ఇప్పుడు జాగ్రత్తగా విను." చెప్పాడు యోగి.

అంతదాకా ఆ యాత్రికుడు తన జీవితంలోఎన్నడూ విననంత ఘనీభవించిన నిశ్శబ్ధాన్ని విన్నాడు.

"దేవుడి కంఠం విన్నాను. చాలా బావుంది." చెప్పాడు అతను.